16062025-MAI-04_Layout 1 6/16/2025 1:58 AM Page 1



# చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

ప్రత్యేక తెలంగాణ మలిదశ ఉద్యమంలో కవులు, రచయితలు తెలంగాణ వ్యావహారిక భాషకు ప్రాధాన్యమిస్తూ విస్తృతంగా రచనలు చేయడం చూశాం. తెలంగాణ తెలుగు భాషలో రాయడం, చదువడం అనివార్యంగా మారిన సందర్భాన్ని తెలంగాణ సమాజం అప్పటినుంచి పునికి పుచ్చుకున్నది. కానీ, ఆ భాషకు ప్రామాణికతను, సూత్రబద్ధతను వృద్ధి చేయడంలో సరైన తెలంగాణ భాషా పరిశోధన జరగలేదనే చెప్పాలి.

తెలంగాణలో ఆయా రంగాల్లో పరిశోధనలు చేసి తమదైన ముద్రవేసిన వారున్నప్పటికీ, ప్రత్యేకంగా తెలంగాణ భాషపై పరిశోధన చేసినవారు ఎవరున్నారనే ప్రశ్న వేసుకుంటే.. ఎటుచూసినా డాక్టర్ నలిమెల భాస్కర్ మాత్రమే కన్పిస్తున్నారు. వీరికన్న ముందు 'తెలంగాణ జాతీయాలు' పేరుతో వేముల పెరుమాళ్లు తెలంగాణ భాషకు పట్టం కట్టేందుకుపడ్డ ఆరాటాన్ని చూశాం.

ఈ గ్రంథం భాషా శాస్త్రంలో భాగంగా చూపబడినా, ఇది పూర్తిగా తెలంగాణ భాషా తీరుతెన్నులను తెలిపే పుస్తకం కాదు. జాతీయాలకే పరిమితమైనది. అయినప్పటికీ ఇదెంతో ప్రామాణికమైనది, ఉపయుక్తమైనది కూడా.

# తెలంగాణ తెలుగే అసలైన తెలుగు




**17 భాషలు** మాట్లాడగలిగే పీవీ నరసింహారావు కూడా కొంతమేరకు 'గొల్ల రామవ్వ' కథలో తెలంగాణ భాషను ఎత్తి పెట్టుకున్న సందర్భం చూడవచ్చు. కానీ, ప్రత్యేకంగా తెలంగాణ భాషపై పరిశోధనలు మాత్రం చేయలేదు. పీవీ తర్వాత 14 భాషలపై పట్టు సాధించి, తెలంగాణ భాషపై విశేషమైన పరిశోధన చేసి, తెలంగాణ భాషకు పట్టాభిషేకం చేసింది ఒక్క నలిమెల భాస్కర్ మాత్రమే.

ఈయనకు తెలంగాణ భాష అంటే ఎందుకో ఎనలేని మక్కువ. ఈ విషయం ఆయన పుస్తకాలను నిశితంగా గమనిస్తే అర్థమవుతుంది. కవిగా, రచయితగా, భాషా శాస్త్రవేత్తగా, ఉపన్యాసకుడిగా నలిమెల భాస్కర్ తెలంగాణ భాషాభివృద్ధికి విస్తృత పరిధిని ఏర్పాటు చేసుకున్న తీరు కనిపిస్తుంది.

తెలంగాణ ఉద్యమ సమయంలో 'ఏది అసలైన తెలుగు' అనే వాదం తెరపైకి వచ్చింది. తెలంగాణ భాషే అసలైన తెలుగు భాష అని నలిమెల భాస్కర్ హేతుబద్ధంగా, తార్కికంగా వాదించారు. ఆయన పరిశీలనలో తెలుగుతో తెలంగాణ తెలుగును పోల్చితే తెలంగాణ భాషలో అనేక ప్రత్యేకతలు కనిపిస్తాయి. తెలంగాణ తెలుగు కావ్య భాషకు, ఇటు గ్రాంథిక భాషకు చాలా దగ్గరగా ఉన్నదని ఆయన అంటారు. తెలంగాణ తెలుగు అచ్చతెలుగు పదాలతో మనల్ని ఆశ్చర్యచకితుల్ని చేస్తుందంటారు. ఇక్కడితో ఆగిపోకుండా ద్రవిడ భాషా పదాలు అనేకం తెలంగాణ తెలుగులో ఇప్పటికీ కనిపిస్తాయని, చాలా అద్భుతమైన జాతీయాలు, సామెతలతో తెలుగు భాష సజీవంగా తెలంగాణలో ఉన్నదని నలిమెల అంటారు. అంతేకాదు, జానపద గేయాలు తెలంగాణ తెలుగులోనే ఎక్కువగా ఉన్నట్టు కూడా ఆయన గుర్తించారు. ఇదే విషయాన్ని డాక్టర్ పీవీ పరబ్రహ్మ శాస్త్రి 'తెలుగు లిపి ఆవిర్భావ వికాసాలు' గ్రంథంలో (పుట-36) 'తెలుగు-తెనుగు' పదాలను దేశ జాతి వాచకాలుగా ప్రస్తావించారు. తెలంగాణ (తెలింగ+ ఆణి)లోని 'ఆణ' అంటే భూమి, దేశం అని, తెలింగాణ అంటే తెలుగు మాట్లాడేవారు నివసించే భూమి అనే అర్థం వస్తుందని చెప్పారు. ఆయన దృష్టిలో తెలంగాణ తెలుగే అసలైన తెలుగని స్ఫురిస్తుంది. ఇదే అంశాన్ని నలిమెల భాస్కర్ సూత్రబద్ధంగా వివరించారు.

### 'ఏకశిలానగర మోరుగల్లే త్రిలింగము నుండి తెలుగు పుట్టెనా'

అన్న కొమర్రాజు వేంకట లక్ష్మణరావు వ్యాసాలను మనం నిశితంగా పరిశీలిస్తే నలిమెల భాస్కర్ వాదనలు వాస్తవమనే నిర్ధారణకు వస్తాం.

నాడు తెలంగాణ సాహిత్యానికి సురవరం ప్రతాపరెడ్డి వెన్నుదన్నుగా నిలబడితే నేడు నలిమెల భాస్కర్ 'అసలు మీది భాషే కాద'న్న వాదానికి వాతపెడుతూ తెలంగాణ భాషే అసలైన తెలుగు భాష అని నిరూపిస్తూ తెలంగాణ భాషకు వెన్నుదన్నుగా నిలబడ్డారు. అందుకు తెలంగాణ భాషపై ఆయన చేసిన పరిశోధన, వెలువరించిన గ్రంథాలే నిదర్శనం. పది తెలంగాణ భాష గ్రంథాలకు తన పరిశోధనతో పురుడుపోశారు.

దీనిలో ప్రధానంగా 'తెలంగాణ పద కోశం' అనే తెలంగాణ మాండలిక నిఘంటువు ఒకటి. దాదాపు ఏడు వేల తెలంగాణ పదాలతో వెలువడిన ఈ నిఘంటువు తెలంగాణలో మొట్టమొదటి పదకోశం.

ఆచార్య రవ్వా శ్రీహరి ఈ పుస్తకానికి 'అభినందనం' పేరుతో ముందుమాట రాస్తూ ఒక మాట అన్నారు. అదేమిటంటే.. 'ప్రాచీన నిఘంటుకారులు ప్రధానంగా లిఖిత వాఙ్మయంలోని పదజాలాన్ని మాత్రమే నిఘంటువులోకి చేర్చడానికి ప్రయత్నించారు. మాండలికాలను గాని, జన వ్యవహారంలోని పదాలను గాని నిఘంటువులలో చేర్చలేదు. దీనివల్ల జన వ్యవహారంలోని అనేక పదాల స్వరూపం గాని, వాటి అర్థాలు గాని జిజ్ఞాసులకు తెలియడానికి అవకాశం లేదు. నలిమెల భాస్కర్ తెలంగాణ పదకోశం వంటి నిఘంటువులు ఈ లోపాన్ని తీరుస్తాయనడంలో సందేహం లేదు' అని అన్నారు. ఈ వ్యాఖ్యలు చాలు నలిమెల భాస్కర్ తెలంగాణ భాషాభివృద్ధికి చేస్తున్న కృషి గురించి చెప్పుకోడానికి. అన్నం ఉడికిందో, లేదో అన్నది ఒక మెతుకును పిసికి చూస్తాం. ఆ మెతుకే 'తెలంగాణ పదకోశం'. ఈ పదకోశమే నలిమెల భాస్కర్ తెలంగాణకు జీవం పోసే వివరణాత్మక దృష్టి కోణం.

నలిమెల ఎంత నిఖార్సైన తెలంగాణ భాషా పరిశోధకుడో ఒక ఉదాహరణ చెప్పుకొందాం. 'తెలంగాణలో లయబద్ధమైన భాష ఉన్నది. నాదాత్మకమైన మాట ఉన్నది. మాట మాట్లాడితే చాలు ఏదో ఒక సంగీతం జాలువారుతున్నది' అని అంటారు. అది ఎట్లనో కూడా వివరిస్తారు.

### 'మాట మాట్లాడడమే కాదు, తెలంగాణలో తిట్టినా..!నాదమే పుట్టుకొస్తుంది'

అని అంటారు. 'తిట్లకు కూడా నాదమే ఆత్మ' అని అంటారు. ఉదాహరణకు 'తల్లాలిని తిట్టినా తాళం తప్పొద్దురా' అన్న సామెత గుర్తుకుతెస్తారు.

ఇది నిజమే కదా మన తెలంగాణలో ఈ పదాల అల్లిక, వాటి గుబాళింపు మనకు ఎర్కనే కదా! ఇంకా దీన్ని సమర్థిస్తూ.. 'కోతైన కొమ్మతప్పి దుంకదు' అన్న రహస్యం తెలంగాణ ప్రజలకు బాగా తెలుసంటారు. పాట ఎంత ముఖ్యమో తెలంగాణ వాసులకు మాట కూడా అంతే ముఖ్యమని అంటారు. 'లయబద్ధంగా మాట్లాడుకునే మాట తీరు తెలంగాణ పాటకు ఎక్కడ లేని బలాన్నిచ్చింది' అని అంటారు. నిజమే తెలంగాణ ఉద్యమ కాలంలో అనేక పాటలు మాటలకు ప్రాణం పోసి, చైతన్యాన్ని రగిలించాయి. మాటే తెలంగాణలో ఎట్లా నాదమైందో కూడా ఉదాహరణలు ఇచ్చారు. తెలంగాణ భాషను నాదమయం చేయడంలో పూర్ణానుసారం పాత్ర కూడా చాలా గొప్పదంటారు. అంటే నిండు సున్న పాత్ర తెలంగాణ మాండలికంలో ఎంత ముఖ్య భూమికను పోషిస్తుందో మొట్టమొదట సోదాహరణంగా వివరించారు.

- **ఇచ్చంత్రం** (విచిత్రం)
- **తాంబేలు** (తాబేలు)
- **లచ్చిందేవి** (లక్ష్మీదేవి)
- **చిమ్మంజీకటి** (చిమ్మ చీకటి)
- **తెల్లందాకా** (తెల్లవారుదాక, తెల్లవార్లు)
- **పుంటి కూర** (పుల్లటి కూర, గోంగూర)
- **పొద్దుందాక** (పొద్దు గూకేదాకా)
- **పొద్దుం జాముల** (పొద్దు గూకే వేళ)
- **వరంగల్** (ఒరుకల్)

ఇట్లా అనేక పదాలను దబ్బుడ్కంతోని కుట్టి తెలంగాణ గోనె సంచిలేసి కట్టి తెలంగాణ ప్రజల కోసం దాచి పెట్టిన్రు. ఆ మూటనిప్పి చారిత్రక, తులనాత్మక దృష్టికోణంతో పరిశీలిస్తే తెలంగాణ మాగాణంలో భాషా ఆవశ్యకత నేటి సమాజానికి అవగతమవుతుంది. పరిశోధనాంశంగా నిలుస్తుంది.

బలంగా వినిపిస్తున్న సమయంలో 'పోతన ఆంధ్ర మహా భాగవతం', ఆయన రచించిన ఎనిమిది స్కంధాలను పరిశీలించి 'తెలంగాణ పద ప్రయోగ సూచిక'ను తయారు చేశారు. అది తెలంగాణ సమాజానికి బమ్మెర పోతనను మరింత చేరువ చేసిందని చెప్పుకోవాలి. అదేవిధంగా తెలంగాణ ఆది కవి, తెలుగు ఆదికవిగా పేర్కొనదగిన పాల్కురికి సోమనాథుని బసవపురాణానికి 'పద ప్రయోగ సూచిక' సిద్ధం చేసి సాహిత్య సమాజానికి బసవపురాణాన్ని, సోమనను మరింత చేరువ చేశారు.

'కాళ్లల్ల కట్టెలు పెట్టుడు' పదాన్ని రెండు రాష్ట్రాల్లో ఏ విధంగా వాడుతారో చాలా స్పష్టంగా వివరించారు. 'వాడు నన్ను అడ్డగించాడు', 'వాడు నన్ను అడ్డుకున్నాడు', 'అంత మంచి పనికి అడ్డంకులు కల్పించవద్దు', 'అసలు నీ పని ఎప్పుడూ అడ్డు పుల్లలు వేయడమేనా' అనే పదాలను గమనిస్తే ప్రామాణిక భాషలోని ఈ 'అడ్డంకులు పెట్టు' అనేది తెలంగాణలోని 'కాళ్లల్లా కట్టెలు పెట్టు' అనేది రెండు సమానార్థకాలు. ఈ అడ్డుపడు అనేది ఒక క్రియ. దీనికి నిఘంటువులో అర్థం 'అడ్డం వచ్చు' అని అర్థం. కానీ తెలంగాణలో మాత్రం 'అడ్డపడు' అంటే సహాయపడు, ఆపన్న హస్తం అందించు మొదలైన అర్థాలున్నాయని అంటారు నలిమెల.

'నాకు ఇంత పెద్ద ఆపతి వచ్చింది. అయినా గుండె ధైర్యం అసలు చెడలేదు. ఆఖరికి ఆ దేవుడన్న అడ్డుపడకపోతాడా..! అన్న ఆశతోని బతుకుతున్న'. ఇక్కడ 'అడ్డుపడు'కు తెలంగాణలో 'రక్షించడం, కాపాడటం' అని అర్థమని నలిమెల అంటారు. తెలంగాణ మాండలికానికి, ఇతర మాండలిక పదాలకున్న వ్యత్యాసం, సారూప్యతలను స్పష్టంగా వివరించారు నలిమెల. ఇది ఆయన నిశిత దృష్టికి, లోతైన పరిశీలనకు నిదర్శనం.

నలిమెల భాస్కర్ 1976లో తెలంగాణ భాషలో రాసిన 'రాతి గుండెలు' మొదలుకొని నేటి 'చెలిమెలు' పుస్తకం(2025) వరకు భాష ప్రధానంగా జీవిస్తున్న నిఖార్సైన తెలంగాణ మట్టి మనిషి. తెలంగాణ ప్రాంతానికి సాహిత్యపరంగా ఎదురైన సవాళ్లను ఎప్పటికప్పుడు తేటతెల్లం చేస్తూ భాషకు ప్రామాణికతను, సూత్రబద్ధతను కల్పిస్తున్నారు. ఉదాహరణకు తెలంగాణ మలిదశ ఉద్యమకాలంలో బమ్మెర పోతన కడప జిల్లా ఒంటిమిట్ట ప్రాంతానికి చెందినవారనే వాదన

వేముల పెరుమాళ్లు 'తెలంగాణ జాతీయాలు', నలిమెల భాస్కర్ 'తెలంగాణ భాషా శాస్త్ర గ్రంథాలు' (పదికి పైగా) ప్రస్తుతం మన ముందు సవాళ్లనుంచాయి. తెలంగాణ భాషా శాస్త్రానికి కావలసినంత ముడిసరుకు ఈ ఉద్యమ నేల మీద ఉందనే వాస్తవాన్ని ఎరుకజేశాయి. ఈ రెండు పరిశోధనాత్మక గ్రంథాలు ఇప్పుడు తెలంగాణ సాహిత్యంలో, ముఖ్యంగా తెలంగాణ మాండలికానికి తలమానికంగా నిలుస్తాయనడంలో ఏ మాత్రం సందేహం లేదు.



డాక్టర్ జీడి రమేష్
96527 56516
(వ్యాసకర్త: తెలుగు గెస్ట్ లెక్చరర్, శాతవాహన యూనివర్సిటీ)



## భాష మాటల సందడి కాదు

భాషలు ఒకటా రెండా లేక మూడా
వేలాది భాషల మనుగడలో
అది చాలా చిన్న లెక్క
రాజకీయ సంవాదం ఆధిపత్య ఆరాటం

నిజానికి 'భాష'
మాటల సందడి కాదు, శబ్ద సమూహమూ కాదు
అది ఆలోచనల ప్రవాహం, భావాల ప్రయాణం

భాష
స్తబ్ధత నిండిన శిల కాదు, నిరంతర చలనశీలి
అది ఏకరూపి కాదు, బహురూపి

స్థలానికీ స్థలానికీ భాష మారుతుంది
స్వరానికి స్వరానికి యాస మారుతుంది
నాలుగడుగులు వేస్తే నడకా మారుతుంది

కుందేలు వేగం జింక హొయలు హంస నడక
పక్షి పయనం భాషకు సొంతం
అది ఎంత సున్నితమో అంత కఠినం

ఆర్తి ఆవేదన ఆవేశం ఆరాధన అభిమానం
భాష అన్నింటినీ ధ్వనిస్తుంది ప్రతిధ్వనిస్తుంది

ప్రకృతిలో
చినుకులు చిగురిస్తాయి వానలు దంచేస్తాయి
వరదలు ముంచేస్తాయి ఉప్పెనలు ఊడ్చేస్తాయి
కన్నీళ్లు కరిగిస్తాయి అవి అన్నీ నీళ్ళే
'భాషా' అంతే
భాషా నీళ్ళూ, కన్నీళ్ళూ దగ్గరి చుట్టాలు

మనిషి అనే చెట్టుకు వేరు మాతృభాష
ఇతర భాషలెన్నయినా కొమ్మలే
కొమ్మలెన్ని పెరిగినా
వేరు తెగితే చెట్టే కూలిపోతుంది

రాజకీయాలు ఎన్ని భాషల్లోనైనా మాట్లాడొచ్చు
భాషనే రాజకీయం చేస్తే
సృజనకు స్వస్తి పలికినట్టే
భవిష్యత్తుకు మంగళం పాడినట్టే

ఎవడి భాషలో వాడు ఎవడి యాసలో వాడు
పలికినప్పుడే
మనిషికి మనుగడ దేశానికి నిలకడ
భవిష్యత్తుకు భరోసా



వారాల ఆనంద్
94405 01281

'పొలాలనన్ని, హలాల దున్ని..' అనే మాటలు ఎంత ప్రఖ్యాతమో, 'జుట్టంతా ఉంగరాలు.. మెరిసేటి కండరాలు...' అనేవి కూడా మరెంతో పరిచితం, ఆకర్షణీయం. పెద్దగా వాడని, ఇలా స్ఫురించని పదాలు వాడటం వల్ల రెండోది మరింత ఆశ్చర్యాన్ని కూడా కలిగిస్తుంది. ఈ కవులకు శబ్దం మీద ఎంత అధికారం ఉన్నదని పాఠకులకు ముచ్చట కలిగిస్తుంది, ఇలాంటి పదాలు వీరికెలా దొరుకుతాయనే ఆలోచన కూడా కలుగుతుంది. ప్రాసలు మరీ ముఖ్యంగా అంత్యప్రాసలు చదవడానికి, వినడానికి పురిగొల్పుతాయి. దానికి కారణం అందులో నిబిడీకృతమైన సంగీతం.

# తొలి తెలుగు రైమింగ్ పదాల డిక్షనరీ

తొట్ట తొలి తెలుగు అకారాది నిఘంటువు మామిడి వెంకయ్య రాసిన 'ఆంధ్ర దీపిక'. అప్పటి దాకా నిఘంటువులు ఛందోబద్ధమైన శ్లోకాలే. దాంతో కంఠస్థం చేయక తప్పేది కాదు. ఒక పదానికి అర్థం కావాలన్నా మొత్తం శ్లోకం గుర్తు చేసుకొని తద్వారా బోధపరుచుకోవాల్సిన పరిస్థితి ఉండేది. అటువంటి నేపథ్యంలో మొట్టమొదటిసారి ఆల్ఫాబెటికల్‌గా డిక్షనరీ తేవడం అనే భావన చాలా రాడికల్. గర్వించదగిన విషయమేమంటే అకారాది నిఘంటువు అనేది భారతీయ భాషల్లోనే ఈ




తెలుగు 'ఆంధ్ర దీపిక' ప్రయత్నమే ప్రథమం కావడం. మామిడి వెంకయ్యను అనుసరించే తర్వాత చిన్నయసూరి, సీపీ బ్రౌన్, బహుజనపల్లి సీతారామాచార్యులు మొదలైన వారు తమదైన పద్ధతుల్లో తెలుగులో నిఘంటువులు రూపొందించారు.

మళ్లీ అందరం ఆనందపడే సందర్భం తెలుగులో 'రైమింగ్ డిక్షనరీ' మొట్టమొదటిసారి రావడం. దాన్ని ఇంకోరకంగా చెప్పాలంటే 'అంత్యానుప్రాస నిఘంటువు'. ఇలాంటి నిఘంటువులు ఇంగ్లీషులోనే కాదు, హిందీలో, తమిళంలో ఇదివరకే వచ్చి ఉన్నాయి. ఇరుగప దండనాథుడు 14వ శతాబ్దంలో 'నానార్థ రత్నమాల'ను 1273 శ్లోకాలతో రచించారు. సంస్కృతానికి సంబంధించి ఇది తొలి అంత్యానుప్రాస నిఘంటువుగా చెప్పవచ్చు. అయితే తెలుగులో 2024 ఆగస్టులో డాక్టర్ అరిపిరాల నారాయణరావు మొదటి తెలుగు రైమింగ్ డిక్షనరీని ఏడు వందల పైచిలుకు పుటలతో వెలువరించారు.

మిగతా నిఘంటువులకు, ఈ అంత్యానుప్రాస నిఘంటువుకు స్థూలమైన తేడా ఏమంటే మనకు కావాల్సిన పదాన్ని వెతికే విధానం. మామూలు నిఘంటువులలో మొదటి అక్షరంపై దృష్టి పెట్టి అన్వేషిస్తాం. అయితే అంత్యానుప్రాస నిఘంటువులో చివరి అక్షరం పైనను, దానికి ముందున్న అచ్చు అకారాది క్రమంలో ఉంటుంది.

ఉదాహరణకు 381 పేజీలో ఒకచోట పరిణద్ధము (కట్టబడినది), పరిణయము (పెండ్లి), పరిణామము (మారు రూపు), పరిణాయము (సారెల యొక్క), పరిణాహము (వెడల్పు, వైశాల్యం) అనే పదాలు వరుసగా కనబడుతాయి. ఆ పదాల అర్థాలను సౌకర్యార్థం బ్రాకెట్లో చూపాను. మరో చోట అల్క (అలుక), అల్కా (తేలికైన, నీచమైన), హల్కా (అల్పమైన, నీచమైన), కల్కి (కలికి రూపాంతరం, అవతార విశేషం) అనే పదాలు వరుసగా కనబడుతాయి. ఇంకోచోట ఉవ్వు, జువ్వు, తువ్వు, దువ్వు, నువ్వు, పువ్వు, ప్రువ్వు, రువ్వు ... అనే పదాలు వరుసగా కనబడుతాయి. అర్థాలతో ఇలాంటి పదాలు ఈ అంత్యానుప్రాస నిఘంటువు లో 50,000 దాకా ఉన్నాయి. 1937 నాటి 'శబ్ద రత్నాకరం' ఆధారంగా డాక్టర్ అరిపిరాల నారాయణరావు 2018 నుంచి శ్రమించి దీన్ని తనే వెలువరించారు. ఈ కృషి కొనసాగిస్తే మరో 50 వేల పదాల దాకా సేకరించవచ్చని కూడా వీరే అంటున్నారు. ప్రస్తుతం 2వ ఎడిషన్ అందుబాటులో ఉంది, హార్డ్ బౌండ్ 718 పుటలు, రూ.600.



డాక్టర్ నాగసూరి వేణుగోపాల్
94407 32392



## మౌనం పగిలితే..

అంతర్మథనం ఆవిరై
తెగింపు
ఒక ఉరుమైతది
అన్నింటినీ కూడదీసుకొని
పిడికిలి మూసుకుంటది
బరిగీసి ఒక శకలం
తీరంపై క్షణ క్షణం
గెలుపును శ్వాసిస్తుంది.

భూమి గుండెలో
అనంతంగా మరిగిన
ఒక ఎర్రని ఆవేశం
నింగి సిగకు
మెరుగుపూల హారం
చుడుతుంది
అంతర్యుద్ధంలో
ఓడిన పువ్వు
అల్లరి వాకిట్లో
నవ్వై పరుచుకుంటది.

జీవితం సరళరేఖపై
నెత్తురోడిన గాయం
చివరికి ఒక అనివార్య
విజయ తీరం మీద
శిఖరమై మెలుస్తుంది.

చివరి క్షణం తర్వాత
మౌనం పగిలిపోయి
అడుగులకు పయనం వైపు
తోవ చూపుతుంది.



అంకం మనోహర్
94925 03339

### జాతీయ సదస్సు

2025 జూన్ 20, 21వ తేదీల్లో ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 'శత జయంతి సాహితీమూర్తులు దాశరథి-ఆరుద్ర జీవితం, సాహిత్యం' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు జరగనున్నది. అందరికీ ఆహ్వానం.

- తెలంగాణ సాహిత్య అకాడమీ

# బతుకు కథకు ప్రతీక

నాన్న పొగబారిన శ్వాస, నాన్న పొలమారిన జ్ఞాపకం, నాన్న బాధ్యతలను నెత్తినెత్తుకున్న బోనం. నాన్న మసిబారే కళ్లల్లో తడారని బంధం. నాన్న ఒక ప్రేమ. నాన్న ఒక భయం. అంతిమంగా నాన్న జీవితం కరిగిపోయే కొవ్వొత్తి. తాను కష్టపడుతూ పిల్లల కళ్ళల్లో వెలుగులు నింపుతాడు.

ఊరు, అమ్మ, నాన్న, కులవృత్తి... ఇవన్నీ ఒక ఎమోషనల్. ఒక ఎటాచ్‌మెంట్. ఒక బాధ్యత. ఒక బంధం. గుండె మౌనంగా దేని కోసమో వెతుకుతుంది. తిరిగిరాని బాల్యంలోనికి కలియ తిరుగుతుంది. జ్ఞాపకాల చెక్కిలి మీద ఒక కన్నీటి చుక్క ఘనీభవిస్తుంది. బాణాల శ్రీనివాసరావు తన 'కుంపటి' దీర్ఘ కవిత ద్వారా ఊరు, నాన్న, కులవృత్తి, తన బాల్యాన్నంతటిని అద్భుతంగా ఆవిష్కరించారు.




తరం మండే అగ్నిగోళం, బ్రహ్మం గారి జాతరలో జనుల కష్టాలను తీర్చే అగ్నిగుండం, అన్నం పెట్టే అన్నపూర్ణమ్మ, కులవృత్తికి చిత్రిక, ఒక గుండె ధైర్యం, ఒక జీవనవేదం, జీవనాధారం, బడుగువర్గాల పర్యాయపదం, చీకటి వెలుగుల నావకు దిక్సూచి, పలికించే తంత్రీనాదం, వెలుగునిచ్చే వెన్నెల దీపం, కళ్లల్లో మెరుపులు, నాన్న కళ్లల్లో మసి, మసకబారిన జీవనం, ఊపిరితిత్తుల్లో పొగ, కుంపటిపై మెరిసే బంగారం జీవితం దినదిన గండం. 3వ స్టాంజాలో...

'సగం తెరిచిన కళ్ళతో
దుకాణంలోకి చూస్తే
యజ్ఞ గుండం ముందు
ఋషిలా
ఒక చేత్తో గొట్టాన్ని ఊదుతూ
మరో చేత్తో నీరుకారును
కుంపట్లో నాట్యం చేయిస్తూ
రెండు చేతుల్ని... ఆడిస్తూ
చెంపలకు రెండు బెలూన్లను
తగిలించుకొని
తీక్షణమైన చూపుల్తో
ఊపిరితిత్తుల్లోని గాలినంతా
కుంపట్లోకి ఊదితే...'

దీనిలో నాన్న పడే కష్టం మనకు కనిపిస్తుంది. వారసత్వంగా వచ్చిన ఆ కళకు రోజూ మెరుగులు దిద్దుతూ, ఓపిక, సహనానికి రోజూ ఎదురయ్యే పరీక్షలను ఎదుర్కొంటూ పని చేస్తేనే ఈ రోజుకు ఇంట్లో బియ్యం ఉడికేది. ఎలా చేస్తే నగ అందంగా ఉంటుందోనన్న ఆలోచన తప్ప పొగ గొట్టాన్ని ఊది ఊది ఊపిరి తిత్తుల్లో పొగ పేరుకుపోతుందన్న విషయం పట్టించుకోడు నాన్న. నాన్న కుటుంబం కోసం చేసే త్యాగాలు ఎన్ని చెప్పినా తక్కువే.

పదహారణాల తెలంగాణ పల్లెను తన అక్షరాల్లో, తన కవితలో తన బాల్యాన్ని మనకు పరిచయం చేస్తాడు బాణాల. సాతానోళ్ల బాయి పక్కన చింతల్లో చిటారుకొమ్మన దాగిన చింత చిగురును కోసి జేబు నింపుకొన్న సందర్భాన్ని మనకు జ్ఞాపకం చేస్తాడు. ఏ బాదర బందీ లేని తన బాల్యాన్ని ఆకాశానికి హద్దుగా అక్షరీకరిస్తాడు. కవి అక్షరాలకు కళ్లుంటాయి. తన అక్షరాల్లో కన్నీళ్లుంటాయి. ఊర్లో కరువు వచ్చినప్పుడు నగలను చేసే నాన్న చేతులు నందికొండ కాలువ పనికిపోయి నాపరాళ్లెత్తినప్పుడు కలిగిన దుఃఖం కన్నీళ్లకే తెలుసు. మధ్యాహ్నం అమ్మ పెట్టిచ్చిన అన్నం డబ్బాను స్కూల్‌కు తెచ్చి నాన్న తినిపించిన యాదిని మర్చిపోలేని కవి శ్రీనివాసరావు కళ్లల్లో కురిసిన కన్నీటిని అక్షరం చేశాడు.

చిన్నప్పటి జ్ఞాపకాలను తెరలు తెరలుగా మబ్బు తొలిగిన సూర్యుడి వలె ఒక్కొక్కటీ కండ్లముందు ప్రవహింపజేస్తాడు. కుంపటి... అవుసలోల్ల (కంసాలోళ్ల) చుట్టూ నిరంతరం

అహర్నిశలూ మన కోసం బతికిన నాన్నను ఎవరైనా మర్చిపోతారా? కవి బాణాల శ్రీనివాసరావు ఈ దీర్ఘకవితను ఒక కథలా కవిత్వీకరించారు. ఈ పుస్తకం చదువుతుంటే ప్రతిదీ ఏదో రూపంలో మనింట్లో మన కండ్లముందు జరిగినట్టు అనిపిస్తుంది. ఈ పుస్తకాన్ని చదువుతుంటే మన ఊరు జ్ఞాపకం వస్తుంది. మన బాల్యం కండ్ల ముందు కదలాడుతుంది. బతుకుదెరువు కోసం పట్టణాలకు వలస వచ్చిన పాపానికి ఊరు బంధం తెగిపోయింది. ప్రాణం పోయాక ఆత్మ మాత్రం ఊరి చుట్టే తిరుగుతుంది.



ప్రమోద్ ఆవంచ
70132 72452



## పైరగాలి

గడప ముందు
ఎప్పట్నుంచి వేచుందో పైరగాలి
గొళ్ళెం తీసి తలుపులు తెరువంగానే
గప్పున వచ్చి అల్లేసుకుంది
అచ్చం.. ద్వీపాంతరవాసం
చేసొచ్చిన ప్రియున్ని
వేచివేచున్న ప్రేయసి అల్లుకున్నట్లే
నేనెటు తిరిగితే తానటే తిరుగుతూ
నన్ను పెనవేసుకుంటున్న ఆ తుంటరి గాలి
ఈ రాతిరికి ఇడిసిపోయేది లేదన్నట్లు
కావలికి తన చిలిపి స్నేహిత
వెన్నెలను వెంటేసుకొచ్చింది

తన స్పర్శ తాకితే చాలు
అందరూ మగత నిద్రలోకి జారుకుంటారు
నాకేమీ మాయరోగమో...
తానొచ్చి నాపై వాలితే చాలు
నిద్రెక్కడికో ఎగిరిపోయి
మెలకువలోనే కలలుకంటూ
ఊహా చిత్రాలు గీస్తుంటాను తన వీపు మీదే...

ఆ పూల వాసనలు అంతే...
నేరుగా నను తాకలేమనుకున్నపుడల్లా
తన వెంట వచ్చే సాకుతో నన్నల్లుకుని
వాటి కుతినవి తీర్చుకొని వెళ్తాయి
పైర గాలి బుంగమూతేసుకుంటుంది
తెలియకుండానే చేయని
తప్పునకు దోషిగా నిలబడి
తన కౌగిట సంకెళ్లలో
బందీగా బిత్తర చూపులు చూస్తాను

బారెడు పొద్దు నన్నాక్రమించుకుంటున్నపుడు
చిరాకుగా ఒళ్ళు దులుపుకుంటాను
నా మీద వాలి సేద తీరుతున్న పిల్లగాలి లేసి
చీ.. పో.. అంటూ కసురుకుంటుంది
వెళుతూ... వెళుతూ... విసుగ్గా నీ
ఒళ్ళుమండా అని తిడుతుంది
ఆపై.. లోనా.. బయటా..
ఒకటే ఉక్కపోతా... చికాకు...



దిలీప్.వి
84640 30808

